

రామగుండం 27వ డివిజన్‌లో ట్యాంకర్ వద్ద బిందెలతో మహిళలు

## రామగుండంలో నీటి యుద్ధాలు

కోల్‌సిటీ, మే 23: రామగుండంలో మళ్లీ నీటి యుద్ధాలు మొదలయ్యాయి. పదేళ్ల తర్వాత బిందెడు నీటి కోసం ఆడబిడ్డలు ఘర్షణ పడే పరిస్థితులు వచ్చాయి. కేసీఆర్ పాలనలో దర్జాగా ఇంటి పట్టునే మిషన్ భగీరథ నీళ్లు పట్టుకున్న మహిళలు, ఇప్పుడు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వస్తున్నారు. నీటి నిర్వహణ ప్రణాళిక లోపంతోనే ఈ దుస్థితి రాగా, పర్యవేక్షణ లోపంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో మిషన్ భగీరథ మంచినీటి పైపులైన్లు చెడిపోతున్నాయి. రెండు రోజులుగా నగరంలో తాగునీ టి సరఫరా నిలిచిపోగా, ఎండల పూట తిప్పలు మొదలయ్యాయి. దాదాపు 20 కాలనీల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పలు డివిజన్లకు బల్దియా వాటర్ ట్యాంకర్ రాగానే ఎగబడ్డారు. బిందెడు నీటి కోసం అగచాట్లు పడ్డా రు. పదేళ్లలో ఏనాడూ ఆడబిడ్డలు బిందెలతో రోడ్లపైకి వచ్చింది లేదని, ఇప్పుడు మా త్రం నీటి కోసం తండ్లాడే రోజులు వచ్చాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాయికల్: రామోజీపేట రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

## ధాన్యం ఇంకెప్పుడు కొంటరు?

రాయికల్, మే 23 : 'అకాల వర్షాలతో ఆగమాగమైతున్నం. వడ్ల కుప్పలు తడిసి ముద్దవుతున్నయ్. ధాన్యం ఇంకెప్పుడు కొంటరు?' అంటూ రాయికల్ మండలం రామోజీపేట, జూలపల్లిలో రైతులు ఆగ్రహించారు. రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిగా ధాన్యం కొనడం లేదని గురువారం రైతులు గ్రామంలోని ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెల రోజులు అవుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ధాన్యం కొనుగోలు జరిగినా తరలించేందుకు లారీలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. క్వింటాల్‌కు మూడు కిలోల వరకు అదనంగా తరుగు తీస్తున్నారని, జోకిన ధాన్యాన్ని లోడింగ్ చేసుకోవాలంటే లారీ డ్రైవర్లకు కూడా డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటు మిల్లర్లు, ఇటు లారీ యజమానులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు లారీల కొరత లేకుండా చూడాలని రైతులు కోరారు. కాగా, ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ ఎండీ ఖయ్యూమ్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# చెరువు మట్టి లూటీ

- పెద్దపల్లి జిల్లా చెరువుల్లో మట్టి తోడేళ్లు
- ఏటా వేసవి కాలంలో జోరుగా దందా
- ఒక్క ఇటుక బట్టీకి అనుమతి చూపి.. పదుల సంఖ్యలో బట్టీలకు తరలింపు
- నిత్యం వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లలో రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- విమర్శల నేపథ్యంలో రంగంలోకి అధికారులు
- రెండు రోజుల్లో 17 టిప్పర్లు సీజ్

**చెరువుల్లో మట్టి తోడేళ్లు పడ్డాయి. పగలూ రాత్రి అనే తేడా లేకుండా తవ్వేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఆసరాగా చేసుకొని.. ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నాయి. ఒక బట్టీ పేరిట అనుమతి తీసుకొని, పదుల సంఖ్యలో బట్టీలకు వందలాది ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లలో పరిమితికి మించి తరలించుకుపోతున్నాయి. చెరువుల మట్టి లూటీ వేసవి ప్రారంభం నుంచే జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా చోద్యం చూసిన యంత్రాంగం, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఒక్కసారిగా రంగంలోకి దిగింది. రెండు రోజుల్లోనే 17 లారీలు, టిప్పర్లు పట్టుకోవడం దందా తీరుకు అద్దం పడుతున్నది.**



కమాన్‌పూర్: చెరువులో మట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్

కమాన్‌పూర్, మే 23: పెద్దపల్లి జిల్లాలో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. చెరువుల్లో మట్టిపై కన్నేసిన పలువురు ఇటుక వ్యాపారులు, పగలూ, రాత్రి అనే తేడా లేకుండా తరలించుకుపోతున్నారు. వాస్తవానికి చెరువుల్లోని మట్టి తరలింపు కోసం ఇటుక బట్టీ వ్యాపారులు కమర్షియల్‌గా రాయల్టీ చెల్లించి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుంటారు. ఆయా చెరువుల నుంచి కేటాయించిన వరకే మట్టి తీసుకెళ్లాలి. అది కూడా తాను అనుమతి తీసుకున్న బట్టికి మాత్రమే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తరలించుకోవాలి. కానీ, కొందరు బట్టీల నిర్వాహకులు మాత్రం అనుమతి పేరిట పగలూ రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వుకెళ్తున్నారు. అంతేకాకుండా లారీల్లో, టిప్పర్లలో పరిమితికి మించిన ఓవర్‌లోడ్‌తో తరలిస్తున్నారు.

### కొరవడిన పర్యవేక్షణ

చెరువుల్లో మట్టి పూడికతీతపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల మట్టిని స్థానిక అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాల్సి ఉంటుంది. రైతులు తమ పంట భూములను మరింత సారవంతంగా మార్చుకునేందుకు, ఇతరత్రా స్థానిక అవసరాల కోసం ఉపయోగించుకుంటారు. అనుమతి పొందిన ఇటుక బట్టీల కోసం వారికి కేటాయించిన మేర తరలించుకోవాలి. అయితే అనుమతి తీసుకున్న వారు నిబంధనల మేరకే తవ్వుకెళ్తున్నారా..? లేదా..? అన్న విషయమై అధికారులు పరిశీలించారు. కానీ, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ దందా జోరుగా సాగుతున్నట్టు తెలుస్తున్నది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. అయితే సంబంధిత శాఖ అధికారులకు ఈ వ్యవహారం గురించి తెలిసినా 'మామూలు'గా తీసుకుంటున్నారే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. బీఆర్‌ఎస్ నాయకులతోపాటు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు మైనింగ్, ఇసుక, మట్టి అక్రమ రవాణాపై దృష్టి సారించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.



మట్టి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ

### రెండు రోజుల్లో 17 వాహనాలు సీజ్

ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. రెండు రోజుల్లో మట్టి అక్రమంగా తరలిస్తున్న 17 వాహనాలను పట్టుకున్నారు. బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ వద్ద ఎనిమిది వాహనాలను సీజ్ చేశారు. గురువారం కూడా పెద్ద ఎత్తున తనిఖీలు చేశారు. రామగుండం మండలం అల్లూరు శివారులోని చెరువు నుంచి రాఘవపూర్ ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు లారీ/టిప్పర్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సముదాన్ ఆధ్వర్యంలో కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. అనంతరం కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామగిరి మండలం సుందిళ్ల, జల్లారం చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు లారీలను తహసీల్దార్ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. అనంతరం రామగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ రెండు మండలాల నుంచే కాదు, దాదాపు పెద్దప ల్లి జిల్లా అంతటా ఈ దందా జోరుగా సాగుతున్నట్టు తెలుస్తున్నది.



రామగిరి: అధికారులు పట్టుకున్న లారీలు

### పూర్తిగా చెక్‌పెడతారా..?

వేసవి వచ్చిదంటే చాలు మట్టి దందా 'మూడు పూలు.. ఆరు కాయలు'గా సాగుతుంటుంది. బట్టీ నిర్వాహకులు మట్టి తరలింపు యథేచ్ఛగా నడస్తుంది. నిన్నా మొన్నటి వరకు వందలాది వాహనాల్లో మట్టి తరలించుకుపోయినా మొద్దు నిద్రపోయిన అధికారయంత్రం విమర్శలు రావడంతో ఒక్కసారిగా మట్టి, ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా వేశారు. రహదారుల వెంట ప్రత్యేక తనిఖీలు చేస్తూ పలు లారీలను, టిప్పర్లను సీజ్ కూడా చేస్తున్నారు. అయితే ఈ దాడులు మూణ్నాళ్ల ముచ్చటేనా.. పూర్తిగా చెక్ పెడతారా..? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## లేని స్థలానికి ₹30 లక్షల దోపిడీ

రాంనగర్, మే 23 : లేని స్థలానికి రూ.30 లక్షలు దోపిడీ చేయడంతో మోసపోయిన బాధితుడు కరీంనగర్ పోలీసులను ఆశ్రయించగా, నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన మారుతి రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. ఇంటి స్థలం కొనుగోలు చేయాలని తన స్నేహితుడికి తెలుపగా గోదాంగడ్డకు చెందిన చిలమల రమేశ్, బండారి శ్రీకాంత్‌ను పరిచయం చేశాడు. ఆ ఇద్దరు కొత్తపల్లి మండలంలోని సర్వేనెంబర్ 205లో మంకమ్మతోటలోని మహ్మద్ ఇక్బాల్‌కు చెందిన 665 చదరపు గజాల స్థలాన్ని విక్రయిస్తాడని తెలుపగా మారుతి రాజ్‌కుమార్ ₹30 లక్షలకు గాను ₹6 లక్షలు అడ్వాన్స్‌గా మహ్మద్ ఇక్బాల్‌కు ఇచ్చాడు. తరువాత అది వివాదంలో ఉందని చెప్పి వేరే భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్తే నమ్మి వారికి మరో ₹10 లక్షలు ఇచ్చాడు. దీనికి గాను అగ్రిమెంట్ రాసివ్వగా ఒక రోజు జక్కుల మల్లేశం, అతని అనుచరుడు గాలిపల్లి సంతోష్‌తో పాటు చిలమల రమేశ్ ఫోన్ చేసి ఇక్బాల్ భూమి తమ ఆధీనంలో ఉందని, తమను వచ్చి కలువాలని సూచించారు. దీంతో వారిని కలువగా 2023 ఏప్రిల్ 20న భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని, మిగితా డబ్బు తేవాలని చెప్పడంతో ₹13 లక్షల 84 వేలు తీసుకెళ్లి ఇచ్చాడు. అయితే, డబ్బులు ముట్టినా భూమి రిజిస్ట్రేషన్ చేయకపోగా రేకుర్తి గ్రామంలోని సర్వేనెంబర్ 146లో ఐదు గుంటలు పాత ఇల్లు కలిగిన భూమిని రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పారు. దీనికి ఓ నకలీ రశీదు సృష్టించి షేక్ అలిబిన్ అనే వ్యక్తితో 605 గజాల స్థలం తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ తర్వాత స్థలం వద్దకు వెళ్లగా అక్కడ ఎలాంటి ఇల్లు నిర్మాణం లేదు. దీంతో మోసపోయానని గ్రహించి రాజ్‌కుమార్ మహ్మద్ ఇక్బాల్, షేక్ అలిబిన్, గాలిపల్లి సంతోష్, జక్కుల మల్లేశంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపిన పోలీసులు మొదట మహ్మద్ ఇక్బాల్, జక్కుల మల్లేశంను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## ఎస్‌యూ పరిధిలో జూన్ 5 నుంచి పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో వచ్చే నెల 5వ తేదీ నుంచి పలు విభాగాల పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 5న ప్రారంభమై 18 వరకు ఉంటాయని, ఎంఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలు 6న ప్రారంభమై 14వరకు ఉంటాయని వివరించారు. బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 5 నుంచి 14వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 5న ప్రారంభమై 11వ తేదీ వరకు, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 5, 6 తేదీల్లో ఉంటాయని వివరించారు.

